# మంచి భవిష్యత్తు

చెల్లెలు కమల అత్తవారింట్లో అష్టకష్టాలు పడుతున్నట్లు తెలిసి మనసు ఆందోళన చెందింది. పెళ్లికి ముందు కన్నవారింట్లో గారాబంతో, ముద్దూ మురిపాలతో తనే అందరి మీద పెత్తనం చెలాయించి పెరిగింది. ఆమె అడిగింది ఇవ్వకపోతే అలక మొదలయ్యేది. అన్నం తినేది కాదు. ఎవరితో మాటాడేది కాదు. కోపం వచ్చిందా అమ్మా నాన్నల మీద కేకలేసేది. నా మీదనైతే ఇక సరేసరి.

నాన్న ఉత్తరం వచ్చింది. చెల్లెలి ఆరోగ్యం బాగాలేదట. తను ఎలక్షన్ పనుల్లో నిండా మునిగి ఉన్నాడట. వెళ్లి కమలని చూసి రమ్మని ఆదేశం. చెల్లెల్ని చూసి రమ్మని నాన్న తనని కోరటం ఇదే తొలిసారి.

నిజానికి కమలది బాల్య వివాహం. పధ్నాలుగేళ్లు కూడా నిండక ముందే పెళ్లి. ఆ రోజుల్లోనే కాదు ఇప్పటికీ ఆడపిల్లలకు బాల్య వివాహాలే సాగుతున్నాయి. అయితే బాల్య వివాహాలే అయినా కాపురానికి వెంటనే పంపించేవాళ్లు కాదు. కనీసం రెండు మూడేళ్లు కన్నవారింట్లోనే ఉంచేవాళ్లు. పండుగలకు పబ్బాలకు అల్లుళ్లు వచ్చేవాళ్లు. వెళ్లేవాళ్లు. ఆ నవదంపతులు ఒంటరిగా ఉండే అవకాశమే ఉండేది కాదు.

కాలేజీ చదువు, అక్కడ సంస్కార భావాలు, ఆదర్శాలు వాటితో ప్రభావితమైనప్పటికీ, ఇంట్లో నాన్నతో చెప్పి ఈ బాల్య వివాహాన్ని

నివారించలేకపోయాను. కమలే విద్యావంతుల కుటుంబంలో పుట్టి ఉంటే ఇంకా చదువుకుంటూనే ఉండేది. మా ఊళ్లో హైస్కూల్ లేని మాట వాస్తవమే. టౌన్‌లో పెట్టి ఆడపిల్లల్ని చదివించే రోజులు కావవి. దాంతో కమల చదువు అయిదో తరగతితోనే ఆగిపోయింది.

పదేళ్ల కిందటి సంగతి.

మా ఇంటి పెరట్లో పూలతోట ఉండేది. ఆ పూల తోటలో కొత్త కొత్త పూల మొక్కలు తెచ్చినాటే వాడిని. పెంచింది కమలే. తోడు చిన్న చెల్లెలు నిర్మల. మా ఊళ్లోనే మా పూల తోట ప్రసిద్ధికెక్కింది. ఎక్కడెక్కడి నుండో కొత్త కొత్త పూల మొక్కలు కమల కూడా తెచ్చేది. మావయ్య, అమ్మమ్మ, చిన్నమ్మ, పెద్దమ్మ - ఆ ఊళ్లల్లోకి వెళ్లినప్పుడల్లా రకరకాల పూల మొక్కలు తెచ్చేది.

ఆ రోజుల్లో పువ్వుల అవసరం ఉంటుండేది నాకు. నా స్నేహితురాలికి ఆ పూలు నేను ఇస్తున్నాను అన్నది కాదు కమల అభ్యంతరం. పూలు ముట్టుకోకూడదు. పూజ కోసం కూడా కోయనిచ్చేది కాదు.

నాన్నమ్మ నన్ను తిట్టడమే కాదు ఆ పూలు అందుకుంటున్న అమ్మాయిని పేరు పెట్టే తిట్టేది. ఏ తప్పు ఎరగని ఆ అమ్మాయిని తిట్టడం కమల మూలంగానే. నేనెంత బాధపడేవాడినో. ఆ అమ్మాయి కన్నీళ్లు పెట్టుకునేది. తెలిసి తెలిసే కమల నాన్నమ్మతో తిట్టించేది.

రెండేళ్ల కిందటి సంగతి. నేను నిరుద్యోగిని. ప్రతి దానికి నాన్నని అడగాల్సిందే. నాన్న దగ్గర కూడా ఒక్కోసారి పైసలు ఉండేవి కావు. నా ఉద్యోగ ప్రయత్నాలు. ఫలానా దగ్గర ఉద్యోగాలు దొరుకుతున్నాయి అంటే ఇంటర్‌వ్యూ కోసం పరుగు. అప్పులు చేయడం. ఈ ఉద్యోగాన్వేషణ పర్వం దాదాపు రెండేళ్లు కొనసాగింది. నాన్నకి తెలీకుండా స్వంతంగా చేసిన అప్పులు. కొందరు సహాయ బుద్ధితోనే అప్పు ఇచ్చేవారు. కొందరు మాత్రం ఒత్తిడి. తిరిగి చెల్లించడం కోసం మళ్లీ అప్పులు. ఆ రోజుల్లో వడ్డీలు లేవు. అది నయం.

ఉద్యోగం వచ్చి ఉద్యోగంలో చేరిపోయి, తొలి జీతం అందుకుంటున్నట్లే ఉండేది. కాని ఆ ఉద్యోగం ఎవరో తన్నుకు పోయేవాళ్లు.

కమల మా ఇంట్లోచేతినిండా పైసలున్న అమ్మాయి. ఒక్కోసారి మా నాన్న కూడా కమల దగ్గర అప్పు తీసుకునేవాడు. ఒక్కనాన్నకి తప్ప ఇంకెవరు అడిగినా ఇచ్చేది కాదు. నాన్న అప్పు చేబదులుగా తీసుకున్నందుకు కొన్నిసార్లు ఎంతో కొంత కలిపి తిరిగి ఇచ్చేవాడు. నాన్న అంటే కమలకి అందుకే ప్రేమ. పిన్ని దగ్గరకు వెళ్తే పిన్ని పైసలు ఇచ్చేది. అమ్మమ్మ తాతాగార్లకు మనమరాలు ముద్దు. ఇక్కడికి వాళ్లు వచ్చినా చేతిలో పెట్టేవాళ్లు. అక్కడకు వెళ్లినా పెట్టేవాళ్లు. మేనమామలు, ఇతర బంధువులు కొన్నిసార్లు వాళ్ల ఇళ్లలో శుభకార్యాలు సందర్భంగా నగలు కూడా పెట్టేవాళ్లు. చిన్న చెల్లెలు నిర్మలకు కూడా ఇచ్చేవాళ్లు. అయితే నిర్మల తన పైసల్ని అమ్మకి ఇచ్చేసేది.

'ఇదుగో నేను ఉద్యోగంలో చేర్తాను కదా. ఇవేళ ఇంటర్‌వ్యూకి వెళ్లాలి....' అని పైసలు అడిగితే - 'నేనివ్వను' అని జవాబు. కమల పద్ధతి అట్లా ఉండేది.

ఇట్లాంటి మనస్తత్వం మూలంగానే ఇప్పుడు అత్తవారింట్లో కమల కొత్త సమస్యలు ఎదురై తట్టుకోలేకపోతున్నదేమోనని నా అనుమానం.

మా బావ జయరాం మంచివాడు. అత్తమామలూ మంచివాళ్లే. ఆడపడుచు ఒక్కతే. ఇంట్లో ఆడపడుచు పెత్తనం మామూలే.

అత్తవారింట్లో కమల కష్టాలు ఏమిటో నా ఊహకు అందలేదు. పోయి చూస్తే తప్ప

తెలిసేట్టు లేవు. అత్తవారింట్లో కోడలిగా అడుగు పెట్టిన అమ్మాయి అక్కడ పరిస్థితులకు అనుగుణంగా మారాలి. తనని తాను మార్చుకోవాలి. అనుభవం మీద కాని పరిస్థితులు అర్థం కావు. అనుభవం లోపించిన ఫలితమే అయి ఉంటుంది. సహనం కావాలి.

మూడురోజులు సెలవు వరుసగా. దాంతో చెల్లెలి దగ్గరకు ప్రయాణం. దగ్గరే. రెండు గంటలు బస్సు ప్రయాణం. అర్థగంట కాలినడక. ప్రయాణం నిశ్చయించుకున్నాను. అయితే నేను ఉద్యోగంలో చేరిన తర్వాత చెల్లెలి అత్తవారింటికి వెళ్లటం ఇదే తొలిసారి. చెల్లెలికి ఏం తీసుకు వెళ్లాలి. ఏం మాటాడాలి..... నాకు తెలీదు. పొరిగింటి మామ్మగారికి ఈ పరిస్థితి చెప్పి వారి సలహా అడిగాను. పళ్లూ మిఠాయీ తీసుకో. వీలయితే ఓచీర కూడా తీసుకొని వెళ్లు...... మామ్మగారి సలహా.

నా ప్రయాణంలో ఒకటే ఆలోచన. అక్కడ బెడిసిన పరిస్థితిని ఎలా సమన్వయ పరచడం అన్నది. నిజానికి నాన్న నన్ను వెళ్లమనటం నాకు నచ్చలేదు. ఇట్లాంటి సమస్యలు పెద్దవాళ్లు పరిష్కరించేవి. వాళ్లు జోక్యం చేసుకోవల్సినవి కాని నిండా పాతికేళ్లు కూడా లేని నేనా పరిష్కరించేది? నాన్న ఉద్దేశం ఏమిటో. తను జోక్యం చేసుకోవాల్సినంత పెద్ద సమస్యగా భావించలేదేమో. అయితే అత్తవారింట్లో కోడలు కష్టాలు ఎంతకీ నా ఊహకు తట్టలేదు.

మధ్యతరగతి రైతు కుటుంబం. పంట వల్ల వచ్చే ఆదాయం ఇంటి ఖర్చులకు పోను మిగుల్తుంది. దానికి తోడు మామగారు ఆ చుట్టుపక్కల నాలుగయిదు గ్రామాలకు మునసబు. పరువూ ప్రతిష్టా ఉన్న కుటుంబం. గౌరవమర్యాదలు తెలిసిన కుటుంబం.

జీవితంలో ఓసారి తప్పటడుగుల్తో తప్పుదార్లు పట్టిపోవడం కన్నా, తన తప్పటడుగు తెలుసుకుని ఆలోచించి చక్కదిద్దుకోవడం అవసరం. సమస్య మన చెప్పుచేతుల్లో లేక బెడిసిపోయి అమ్మాయికి కన్నవారిల్లే దిక్కయినప్పుడు......

మన కళ్ల ముందు ఎన్ని పెళ్లిళ్లు - ముళ్లబాట పట్టటం మనం చూడడం లేదు? మూడు ముళ్ల ముచ్చటకాదు. అడుగేసిన చోటల్లా ముళ్లే అయి ముచ్చెమటలు పట్టిన బతుకులు.

భగవంతుని ప్రార్థించటం తప్ప ఏం చేయగలం?

ఇంకా నయం పిల్లా జెల్లా లేరు.

పిల్లా జెల్లా లేరన్నది కూడా ఒక కారణమా?

ముద్దూ మురిపెమూ జీవితాల్లో లేకపోతే ఇట్లాగే ఉంటాయి బతుకులు. పెళ్లికి ముందు ముద్దూ మురిపెమూ కమల విషయంలో ఒక మోతాదు ఎక్కువే. అదే ఇప్పుడు ఎదురు తిరిగిందా? కమల చదువు పెద్దగా లేకపోయినా బుద్ధిమంతురాలే. భర్త అంటే ప్రేమ ఉన్నదే.

బావలోనే ఏదో లోపం ఉండాలి. చివరకు నా దృష్టికి సమస్యకి మూలం అక్కడే ఉందని అన్పించింది.

సమస్య బావలోనే అయితే నేను పరిష్కరించగలను.... ఏ పొలం గట్టు మీదనో, తోటలోనో, చెరువు దగ్గరో కూర్చుని విషయాలన్నీ మాటాడుకోవచ్చు. జయరాం కల్లాకపటం ఎరగని మనిషి. ఈ విషయంలో నెగ్గగలనన్న నమ్మకం బల పడింది. చూడాలి.

కమల ఇట్లాంటి సమస్యలను సులభంగానే పరిష్కరించుకోగలదు. అయితే ఆ పరిష్కారమే ఇతరుల పాలిట సమస్య అయిందేమో.

* * *

'మీ అన్నయ్య వచ్చాడు' అన్న కేక కమలకి వినిపించేట్టు.... అత్తమ్మ, ఇంకా వాకిట్లోకి అడుగు పెట్టకముందే నన్ను చూసి గుర్తుపట్టి సంతోషం పట్టలేక చెప్పినట్టు ధ్వనించింది నాకు.

కమల లోపలి గదిలోంచి బైటి గదికి వచ్చింది. కమల కళ్లల్లో సంతోషం. ముఖమంతా విచ్చుకున్న సంతోషం. అన్నయ్యని చూసిన సంతోషం. తనకోసం అన్నయ్య వచ్చాడన్న సంతోషం.

ఏడాదికి పైనే అయింది కమలను చూసి. సామాన్యంగా సంక్రాంతిపండగ రోజుల్లో కలుసుకునే వాళ్లం.... మా నాన్నగారికి సంక్రాంతి పండగ చాలా ఇష్టం. సంక్రాంతి రోజున ఊళ్లో ఉన్న దగ్గరి బంధువులు అంతా ఇంట్లో ఉండేవారు. విందుభోజనాలు. ముచ్చట్లు. హాస్యోక్తులు. సరదా సరదాగా గడిచిపోయేది.

కమల ముఖంలో సంతోషం అయితే కన్పించింది కాని ఇల్లు మాత్రం మనుషులు లేని కొంపలాగ అన్పించింది. కాళ్లు కడుక్కోవటానికి అత్త నీళ్లు తేవటానికి లోపలికి వెళ్లింది.

ఆ సంతోషం కమల ముఖంలో ఎంతసేపో ఉండలేదు. కొద్ది సేపట్లోనే ఆ ముఖంలోని సంతోషం అంతా అదృశ్యమైపోయింది. గడ్డకట్టినట్టుగా మౌనం.

'మీ అన్నయ్య....' ఆ గొంతులో ఆనందం, ఆశ్చర్యం.

నవ్వు ముఖంతో ఎదురొచ్చిన బావ జయరాం.

ఆ క్షణంలో నాకేమనిపించిందంటే అక్కడ సమస్య అని భయపడేది ఏదీ అసలు లేనే లేదని. కొన్నిసార్లు మనం లేని సమస్యలను కోరి తెచ్చుకుంటాం. లేదా సృష్టించుకుంటాం. అట్లాంటిది ఏదో జరిగినట్టు ఇక్కడ ఇప్పుడు తెలుస్తూనే ఉంది. నా మనసు తేలిక పడింది.

నేను హఠాత్తుగా వచ్చినందుకు వాళ్లంతా సంతోష పడిపోతున్నారు.

అత్తమ్మ కాళ్లు కడుక్కోవటానికి నీళ్లు తెచ్చింది. కాళ్లు కడుక్కుని లోపల గదిలో అడుగు పెట్టేసరికి చల్లగా, ఎండ తాపం తగ్గి హాయిగా ఉంది. బంధువులు వచ్చినపుడు కూర్చునేందుకు నవారు మంచం. దాని మీద కూర్చున్నాను. నా ప్రక్కనే జయరాం కూర్చున్నాడు. అంతలోనే అత్తమ్మ పెద్ద గ్లాసులో నిమ్మరసం పిండిన మజ్జిగ తెచ్చి చేతిలో పెట్టింది.

ఇప్పుడు నాకు ఓ కొత్త పరిస్థితి ఎదురయింది.

'ఏమిటి నాయినా ఇలా వచ్చినావు?' అని అడిగితే నేనేం సమాధానం చెప్పాలి? పరిస్థితి తారుమారయినట్టు తెలుస్తూనే ఉంది.

నాన్న రాసిన ఉత్తరం నేను సరిగ్గానే అర్థం చేసుకున్నానా?

కమల ఆరోగ్యం బాగా లేదని చూసి రమ్మని రాశాడు. కాని అత్తవారింట్లో కమల కష్టాలు పడుతున్నదని.... రాయటం ఇష్టంలేక నాన్న అట్లారాసి ఉంటాడని నేను అర్థం చేసుకోవటానికి వేరే కారణం ఉంది. మా ఊరు నుండి వచ్చిన మా బంధువు ఒకాయన మాటల్లో ఈ సంగతి చెప్పిన వారం దినాల్లోనే నాన్న ఉత్తరం.

గతవారం దినాలుగా నేను ఆలోచించిన పరిష్కార మార్గాలన్నీ ఇప్పుడు నిరర్థకాలయ్యాయి. అదే సంతోషం. దాంతో నా మనసు తేలిక పడింది.

మామయ్య కూడా కన్పించాడు. దేవాలయం నుండి వచ్చినట్లు తెలుస్తూనే ఉంది. మావయ్య ముఖంలో కూడా సంతోషమే. కన్నదానికి విన్నదానికి భేదం ఉందంటారే అదే ఇప్పుడు నాకు అనుభవం అయింది.

ఇవన్నీ నెమ్మదిగా వాస్తవాన్ని తెలియజేస్తాయేమో - కన్పించటానికి అంతా బావున్నట్లే ఉన్నా అసలు కథ తర్వాత్తర్వాత్త బైటపడుతుందేమో....

ఆ ఊళ్లో ఇరుగు పొరుగు వాళ్లే కాదు అంతా బంధువులే.

వాళ్ల ద్వారా యదార్థాలు కొన్నన్నా బైటపడతాయి.

'అల్లుడూ నీవు ఎప్పుడు పెళ్లిచేసుకుంటావురా?' అత్తమ్మ నవ్వుతూనే నా మీద తన అస్త్రం సంధించింది.

నా పెళ్లి, ఇంట్లో సమస్య అయిందన్నది తెలిసిందే. నేను ఇప్పుడప్పుడే పెళ్లిచేసుకోను అని చెప్పినా వాళ్ల ప్రయత్నాలు వాళ్లు మానలేదు. అత్తయ్యకు ఈ సంగతి తెలిసిందే. చదువులూ, పట్నాల్లో ఉద్యోగాలూ, సంస్కారభావాలూ - అట్లాంటి వాటితో ఆమెకు సంబంధం లేదు. ఇట్లాంటి సమస్య వచ్చినప్పుడల్లా నాకు మన పెద్దలు జెప్పిన ఒక సమాధానం ఉంది. అదే చెప్తుంటాను నేను. కళ్యాణ యోగం రావాలి కదత్తమ్మా... అని. ఆమె నవ్వేసి 'ఈ దొంగ మాటలు చెప్పకు' అని నన్ను కోప్పడింది.

ఇప్పుడు సమస్య కమలది కాదు. నాదన్న మాట.... బావుంది కదా.... ఎటు వచ్చిందో

చూడండి. పెళ్లిళ్లు ప్రేమతో పరస్పరం ప్రేమించుకున్న యువతీ యువకుల మధ్య జరగాలే తప్ప పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు కాకూడదనీ, కులభేదాలు పాటించకూడదనీ, ఆర్థికంగా పరిస్థితి బాగుపడితే తప్ప పెళ్లిళ్లుచేసుకోకూడదనీ, వరకట్నాలు తీసుకోరాదని ఆదర్శాలు వల్లెవేస్తే అత్తమ్మకు అర్థంకాదు. అయినా ఆమె పద్ధతి ఆమెది. మన పెద్దలు చెప్పిన ఆచారాలలో కూడా మంచి ఉందనీ - కుటుంబం మంచీ చెడు చూడాలి, కుటుంబం గౌరవం కూడా ముఖ్యమేనని, కట్నాలు - తల్లిదండ్రులు సంతోషంగా ఇచ్చుకునేదే తప్ప బలవంతం లేదనీ ఆమె అభిప్రాయం.

వచ్చి దాదాపు మూడు గంటలు గడిచింది. అయినా అసలు సమస్య బైటపడనే లేదు. భోజనాలయ్యాయి. అత్తమ్మ స్వయంగా వడ్డనలు చేసింది. నేను తెచ్చిన మిఠాయి భోజనాల్లో పెట్టారు. పండ్లు, చీర కమల చేతిలోనే పెట్టినా పెత్తనం అంతా అత్తమ్మదే.

భోజనం తర్వాత మామయ్యకి కొంచెం సేపు నడుం వాల్చటం అలవాటు. ఇరుగు పొరుగు పనుల్లో అత్తమ్మ బైటికి వెళ్లింది. జయరాం కూడా ఇంట్లో లేడు. కమల ఒంటరిగా దొరికింది.

'నాన్న ఉత్తరం రాశాడు. అందుకే వచ్చాను.' అన్నాను గొంతు తగ్గించి.

కమల మాటాడలేదు. మౌనంగా ఉండి పోయింది. మౌనంతోనే తమ భావాలు చెప్పుకోవడం కొందరికి సులభంగా అలవడిన విద్య. కమల కళ్లల్లో కన్నీళ్లు సుళ్లు తిరిగి బొటబొటా కురవసాగాయి. పెద్ద కళ్లు. గుండెల్లోంచి ఉప్పొంగి కురుస్తున్న దుఖ్ఖం. బావురమని ఏడవలేక దుఖ్ఖాన్ని వెళ్లగక్కుతున్న కన్నీళ్లు. పక్కగదిలో పండుకున్న మామగారి చెవిలో పడకూడదని దిగమింగుకున్న దుఖ్ఖం.

నా కళ్లల్లో కన్నీళ్లు చేరాయి. అంతా అలుక్కుపోయింది. లేచి వెళ్లి ఆమె చీర కొంగుతోనే కన్నీళ్లు తుడిచాను. భుజం మీద చెయ్యివేసి ధైర్యం చెప్పాను. అయినా కమల కన్నీళ్లు ఆగలేదు. రెండు చేతుల్తో ముఖాన్ని దాచుకుని ఏడవసాగింది. మనసుకి గాయం తగిలిన బాధ. హృదయం తట్టుకోలేని బాధ.

నా నోట మాట రాలేదు. నేను కూడా మూగిగా ఉండిపోయాను.

'నాన్నకి ఉత్తరాలు రాస్తూనే ఉన్నాను. రమ్మని. ఏడెనిమిది కబుర్లు పెట్టాను. అత్త మాటలు - దెప్పి పొడుపులు - నేను చెప్పలేను, అమ్మా అయ్యా లేని చందం అయింది నాకు.' కంఠం రుద్ధమయింది. జీరపలుకుతోంది గొంతు. దుఖ్ఖం, బాధ, హింస, నిస్సహాయత అన్నీ కలిపి అశ్రువులై ఏకధారగా కురుస్తున్నాయి.

నా జీవితంలో ఇట్లాంటి దృశ్యాన్ని ఎప్పుడూ చూడలేదు. ఇట్లాంటి బాధని అనుభవించలేదు.

ఈ దుఃఖం తట్టుకోలేక.... ఎందరు ప్రాణత్యాగాలు చేసుకోవడం లేదు?

'ఆయన మాత్రం ఏంచేస్తారు. అమ్మా నాన్నల దగ్గర నోరత్తెలేరు. ఎన్నన్నా నోరత్తలేరు. అలా ఊరుకోవడమే కొంతనయమయింది.'

ఈ మాటలు వింటున్నప్పుడు కూడా నాకు అసలు సమస్య అర్థం కాలేదు. అత్త సూటిపోటి మాటలు ఏమిటి? కమల ఆ మాటలకే బాధపడుతున్నదా? జీవితంలో భర్త వల్ల తప్పించి ఇతరుల వల్ల కష్టాల కలుగుతాయన్న దృష్టి కూడా నాకు కలగలేదు. అత్తమామలు అభిమానంతో కోరి చేసుకున్న పెళ్లి. అభిమానం అనురాగం ఉన్న మనుషులు. కాని ఇప్పుడు......

'బావకి నీకు మధ్య ఇబ్బందులు ఏమీ లేవు కదా?'

లేనట్టే తలూపింది.

'ఆయన ఒత్తి అమాయకులు. పొలం పనులు చూసుకోవడం, తండ్రి ఏమి చెప్తే అది చెయ్యటం తప్పించి ఇంకేది పట్టించుకోరు. ఆయన్ని చూసే సరికి కన్నీళ్లు తిరుగుతాయి.....'

కన్నీళ్లు పెట్టుకుంది కమల.

చీర కొంగుతో కళ్లు తుడుచుకుంటున్నా కన్నీళ్లు ఆగటంలేదు.

జయరాంని చూస్తే జాలి కలుగుతుంది. అతడి నిస్సహాయ పరిస్థితి.

ఇంటర్‌మీడియట్ ఫెయిల్ అవటంతో జయరాం చదువు ఆగిపోయింది. ఉద్యోగప్రయత్నాలు ఏవీచేయలేదు. ఊళ్లో ఉన్న వ్యవసాయం చాల్లే. ఒక్కడే కొడుకు. వ్యవసాయం పనులు చూస్కోవటానికి ఇంటిమనిషి ఒకరు ఉండాలి. పై ఊళ్లో ఉద్యోగాలకు పంపిచవలసిన ఒత్తిడి ఏదీలేదు. అంతలో పెళ్లి. కట్నాలు, కానుకలు, మర్యాదలు. రాకపోకలు. ముద్దుల భార్య..... అత్తమామల ప్రేమ. కమలని కాపరానికి తెచ్చేవరకు.... అంతా మధురమధురంగా గడిచిపోయింది. ఇదుగో రెండు మూడేళ్లు గడిచేసరికి ఇప్పుడు తెలుస్తున్నది తనకు ఇంట్లో సంకెళ్లు పడ్డాయని. తండ్రే స్వయంగా తనకీ సంకెళ్లు వేశాడని. ఇప్పుడు ఎట్లా తెంచుకోవడమో తెలీదు. తన సంకెళ్లను చూసి బాధ పడుతున్నది తనకన్నా ఏక్కువ కమల.

ఇప్పుడు ఆ ఇంట్లోని ఈ నిర్బంధ వాతావరణానికి మూలపురుషుడు మామగారేనని స్పష్టమయింది. చూట్టానికి అది సమస్యగానే కన్పించదు. పిల్లల మేలుకోరి పెద్దలు కొన్నిసార్లు కఠినంగా ఉండవలసి వస్తుంది. దాన్ని అర్థం చేసుకుంటే ఈ బాధ ఉండదు కదా. ఈ ఆస్తులు అన్ని ఎవరికోసం. కొడుక్కోసమే కదా. వాడు మాత్రం చెడ్డమనిషా? ఏమన్నా చెడ్డ అలవాట్లున్నాయా..... అని నాన్న సైతం వాదించాడు.

ఇప్పుడు ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకోగల తెలివితేటలు కమల జయరాంలకి కావాలి.

నేను వాళ్లకి సలహాలు ఇవ్వటం అసందర్భంగా తోచింది. జయరాంతో మాటాడాలనుకున్నవాడినల్లా ఇప్పుడు ఆ అవసరం లేదు అనుకున్నాను.

కొన్నిసార్లు సమస్యల్లా కనిపించినవి అంతలోనే అదృశ్యం అయ్యే అవకాశం ఉంది.

అయితే కమల కన్నీళ్లు.....

వంట పని అంటూ కమల లోపలికి వెళ్లింది. కమల బాధపడుతున్న సంగతి అర్థనవుతున్నది. మరి కమల బాధ బావకి అర్థమవుతున్నదా?

నా ప్రక్కనే మంచం మీద కూర్చున్నాడు జయరాం.

కన్నవారింట్లో ఆటపాటలకీ, ముద్దుమురిపాలకీ అలవాటు పడిన కమలకు అత్తవారి ఇంట్లో కోడలిగా అంతా కొత్తగా, కొన్నిసార్లు తనని భయపెట్టే పరిస్థితులు ఎదురవటంతో తట్టుకోలేకపోతున్నది..... అన్నమాట నిజం. మెల్లగా సర్దుకుంటుందని అన్పించినా తట్టుకోగల శక్తి ఉందా అన్నది నాకూ అనుమానమే.

'ఇప్పుడే వస్తాను' అని లేచాడు జయరాం. నేను ఆపబోతే 'పశువులకు గడ్డి వేయించి వస్తా....' అని కదలబోయాడు.

'సరేలే ఆగు. నీవు వెళ్లకపోతే ఆ పని ఆగిపోదులే' అని చెయ్యి పట్టుకున్నా.

దీనంగా చూశాడు.

'వాడు చూస్తే కేకవేస్తాడు.' 'వాడు' అంటే తండ్రి.

ఆ మాట చాలు జయరాం పరిస్థితిని అర్థం చేసుకోవటానికి. జయరాం వెళ్లిపోయాడు. నేను జయరాంతో కదిలాను. ఇంటి వెనక పశువులసాల. పది పన్నెండు వరకు ఉన్నాయి. గేదెలు నాలుగు. ఆవులు ఆరు. ఎడ్లు రెండు. కాకుండా దూడలు రెండు. కంబార్లు (జీతగాళ్లు) చూసుకునే పనులవి. జయరాం చేయనక్కర్లేదు. కాని వాళ్లు చేస్తున్నారో లేదో జయరాం చూడాలి.

ఆ పశువుల సాలలోనే ఓ వైపు ఎడ్లబండి ఉంది. దానిమీద ఇద్దరం కూర్చున్నాం. ఆ ఆవులూ, దూడలూ, గేదెలూ, ఎడ్లూ మమ్మల్ని చూస్తున్నాయి.

పరీక్ష మళ్లీ రాయలేకపోయావా తో మాటలు మొదలయి, ఊళ్లో మంచి చెడ్డలు, ఈర్ష్యాద్వేశాలు, స్నేహితులు - ముచ్చట్లు సాగి చివరకు 'కమల లేకపోతే నేను ఎటన్నా పారిపోయేవాడిని' దగ్గర ఆగింది.

జయరాం మానసిక సంక్షోభం ఆ మాటల్లో అర్థమయింది.

జయరాం అవస్థ అర్థమయింది. స్వేచ్ఛ కావాలి. తండ్రి పెత్తనం నుండి విముక్తి కావాలి. అయితే ఆ స్వేచ్ఛ కోసం ఏంచెయ్యాలో తెలీదు.

అత్తామామలు ఇద్దరూ నామట్టుగ నాకు మంచివాళ్లే. ఇష్టపడి కోరి మరీ చేసుకున్న సంబంధం.

కట్నకానుకలు, మర్యాదలు విషయంలో పెద్దకూతురు పెళ్లి ఘనంగా చేసి ముద్దూ మురిపెం తీర్చుకున్నాడు నాన్న. ఏ లోటు చెయ్యలేదు. కమలని పెళ్లి తర్వాత అత్తవారింటికి పంపించినప్పుడు దుఃఖాన్ని ఆపుకోలేక నాన్న బొటబొటా కన్నీళ్లు పెట్టుకుని ఏడవటం నాకళ్లతో నేను చూసిందే.

పెళ్లి తర్వాత కాపరానికి కమల వెళ్లినప్పుడు ఇల్లంతా బోసి పోయినట్టు అన్పించింది. నాన్న అమ్మా అయితే కొన్ని నెలల పాటు తట్టుకోలేక పోయారు. నేను కాలేజీ చదువుల మూలంగా దూరంగా ఉన్నా, ఊరు వెళ్లినప్పుడల్లా తెలుస్తుండేది. మధ్య మధ్య వెళ్లి కమలని చూసి వచ్చేవాళ్లు.

కమల మెడలో బంగారు గొలుసు..... పన్నెండు తులాల గొలుసు.... మామ తీసుకున్నాడు. ఆ సంగతి తెలిసి నాన్న గొడవపడడం ఇష్టంలేక కమలని అత్తవారి ఇంటినుండి తీసుకువచ్చేశాడు. నగ తిరిగి పెట్టనిదే కమలని పంపిచటం జరగదని స్పష్టం చేశాడు. మామ ఏం మాటలు చెప్పాడో ఏమిటో, ఏమని బతిమిలాడుకున్నాడో ఆరునెలల తర్వాత తిరిగి అత్తవారింటికి పంపించేశాడు. ఇప్పటికీ ఆ నగ అయితే కమల మెడలో లేదు. ఎకరం భూమి కొన్నాడట!

కమలకు నెలతప్పిందట. అయినా వాళ్లముఖాల్లో సంతోషం లేదు.

నాకయితే అది సంతోష వార్తే. 'ఉండు ఇప్పుడే వస్తాను. ఇక్కడే ఉండు' అని నేను ఇంట్లోపలికి పోయి, నేను తెచ్చిన మిఠాయి పేకట్ నుండి రెండు లడ్డూలు పట్టుకుని ముందుగా కన్పించిన కమల నోట్లో ఒక లడ్డు పెట్టి 'చెప్తా ఇప్పుడే' అనుకుంటూ జయరాం దగ్గరికి వెళ్లి ఆ రెండో లడ్డు తినిపించాను.

ఇది శుభవార్తే.... ఇక్కడ కొత్త జీవితం మొదలవుతుంది.

కమల తల్లి కాబోతున్నది. జయరాం తండ్రి కాబోతున్నాడు. మేనమామ బిరుదు నాకు దొరుకుతున్నది.

కమల కన్నీళ్లు.... హసిత బాష్పాలు ఇప్పుడు.

ఆ రెండోరోజు వెళ్లిపోయే ముందు 'నీవు ఇప్పుడు ఎందుకింత సంతోషంగా ఉన్నావో అర్థమయింది అత్తమ్మా' అన్నాను.

అత్తమ్మ ఎప్పటిలాగే నిండుగా మరోసారి నవ్వి 'మాకు పప్పన్నం ఎప్పుడు పెట్తావో చెప్పు' అని నన్ను సాగనంపటానికి వీధి వరకూ వచ్చింది. 'అప్పుడప్పుడూ వస్తూ ఉండు. మీ చెల్లెళ్ళి చూడటానికయినా వస్తూ ఉండు' అని మావయ్య వాకిట్లోనే ఆగిపోయాడు. బస్ ఎక్కించేవరకు జయరాం నాతో వచ్చాడు. మా ఇద్దరి మధ్య ఈ అర్థగంటసేపు

ముచ్చట్లన్నీ చదువు, ఉద్యోగ ప్రయత్నాల మీదే సాగింది. జయరాంకి ఇప్పుడు ఉద్యోగం కావాలి.... ఇంటి నుండి బైటపడాలని ఉంది.

* * *

కమల సీమంతంలో మళ్లీ అంతా కలుసుకున్నాం. కమల తన దుఖ్ఖాన్ని మరచిపోయినట్టు కన్పించింది. పెళ్లి రోజులు నాటి సంతోషం. ధైర్యం. అత్తమామలు - చూడటానికి కొత్తగా కన్పించారు. పాత అభిమానాలు, అనురాగాలు వాళ్ల మాటల్లో మరింత స్వచ్ఛంగా సహజంగా కన్పించాయి.

ఇప్పుడు కొత్త కమల. నిండుకుండలా గంభీరంగా కన్పించింది. జయరాం కొత్త బలం పుంజుకున్నట్టుగా కన్పించాడు. రెండు మూడు సార్లు తండ్రితో పోట్లాట పెట్టుకున్నాడట..... పరిస్థితులు నెమ్మదిగా కమలా జయరాంలకు సానుకూలంగా మారుతున్నాయి. వదిన విషయంలో తల్లితో కూతురు పోట్లాట పెట్టుకున్నట్టు తెలిసి నేను చాలా సంతోషించాను.

నాలుగయిదు మాసాలు గడిచాయి. ఈ మధ్యలో ఊరు వెళ్లటం పడలేదు. కమలకి పాపాయి పుట్టిన శుభవార్త రాశాడు నాన్న. నా సంతోషానికి పట్టపగ్గాల్లేవు. చిన్నారి పాపాయిని వెంటనే చూడాలనిపించింది. పాపాయి కోసం చిన్న బంగారం గొలుసు, రోజుల పాపాయి కోసం గౌనులు కొనుక్కుని రెండో రోజే ఊరు ప్రయాణం పెట్టుకున్నాను.

నేను వెళ్లేసరికి అంతా సంతోషంగానే కన్పించారు.

అంతలోనే తెలిసింది జయరాం ఇంట్లో చెప్పకుండా రెండ్రోజుల క్రిందట ఎక్కడికో పారిపోయాడట....

పారిపోయాడా? లేక..... అందరి గుండెల్లోనూ భయం.

*

*ఆంధ్ర సచిత్ర వార పత్రిక 26-01-1962*